చంద్రబాబువన్నీ తప్పుడు ఆరోపణలే



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు



వైభవుని సన్నిధిలో పూజల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగలేదు
- భక్తుల మనోభావాలు చంద్రబాబు దెబ్బతీయడం దారుణం
- పథకాలు అమలు చేయలేక ప్రజలను పక్కదారి పట్టించే యత్నం
- వైభవుని సన్నిధిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, శ్రేణుల పూజలు

మర్రిపాలెం: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని చంద్రబాబు చేసినవన్నీ తప్పుడు ఆరోపణలే అని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. లడ్డూ తయారీ కోసం జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యిని వాడారంటూ కూటమి ప్రభుత్వ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగలేదని, కావాలనే వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డిని ఈ వివాదంలోకి లాగుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు చేసిన పాపాలు ప్రక్షాళన చేసేందుకు జీవీఎంసీ 49వ వార్డులోని శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

ఈ సందర్భంగా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం వివాదంలో కావాలనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఇరికిస్తున్నారని ఆరోపించారు. భక్తుల మనోభావాలు దిబ్బతినేలా సీఎం చంద్రబాబు వ్యవహరించడం సరికాదన్నా రు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలపై భక్తుల్లో అనుమానాలు పెంచే విధంగా, కోట్లాది మంది హిందువుల విశ్వాసాలు దెబ్బతీసేలా చంద్రబాబు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తిరుమల విశిష్టత, పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరించడం సరికాదన్నారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు మాట్లాడుతూ కోట్లాది మంది ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ మహాప్రసాదం పేరుతో భక్తుల మనోభావాలు దెబ్బతీయడం సరికాదన్నారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ అతి పవిత్రమైన లడ్డూ వ్యవహారాన్ని రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. కార్పొరేటర్ బర్కత్ అలీ మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై విచారణ చేయించి వాస్తవాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందని రిపోర్టు జూలై నెలలో వస్తే దాన్ని సెప్టెంబర్‌లో బహిర్గతం చేయడం వెనుక ఆంతర్యం, రాజకీయ దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, పైడి శ్రీను, దుప్పలపూడి శ్రీనివాసరావు, పి.సునీత, నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న దిబ్యాకుమార్ బారుహ్

సీతంపేట : ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లంకపల్లి బుల్లయ్య కళాశాలలో కార్డియో వాస్కులర్ డిసీజ్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రి కార్డియాలజిస్ట్ దిబ్యాకుమార్ బారుహ్ కార్డియో వాస్కులర్ వ్యాధి నివారణ, రోగ నిర్ధారణ, పరిశోధన పద్ధతులపై ప్రసంగించారు. అవగాహన కార్యక్రమాల ద్వారా కార్డియో వాస్కులార్ డిసీజ్‌పై యూరోపియన్ దేశాల్లో గణనీయమైన పురోగతి సాధించారన్నారు. గుండె ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో భారతదేశం వెనుకబడి ఉందన్నారు. దేశంలో గుండె జబ్బులతో బాధపడుతున్న వారిలో 60 శాతం మంది సకాలంలో చికిత్స కోసం ఆస్పత్రికి చేరుకోవడం లేదన్నారు. భారతీయులు జన్యుపరంగా గుండె జబ్బులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో అవగాహన పెంచుకుని, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గుండె జబ్బులను ప్రారంభ దశలో ఎలా గుర్తించాలి, ఒత్తిడికి గురి కాకుండా తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈవో బండారు ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహా గణపతి ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప షిర్డీసాయిబాబా ఆలయ కార్యనిర్వహణాధికారిగా బండారు ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆలయ అర్చకులు రామారావు శర్మ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అర్చకులు వజ్జిల ఉమామహేష్, సిబ్బంది శేఖర్, శివ, తదితరులు పాల్గొన్నారు. ఇప్పటి వరకూ మాధవధారలోని వైభవ వేంకటేశ్వరస్వామి, వెంకోజీపాలెంలోని రామానంద ఆశ్రమం ఈవోగా ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సరకు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఆర్పీయఫ్ మహిళా ఎస్ఐ పీఆర్ బిషోయ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన అమన్ సఖ్య, రాధేశ్యామ్ వద్ద 11.4 కేజీల గంజాయి గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా మధ్యప్రదేశ్‌కు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తెలిపారు. ఆర్పీఎఫ్ సిబ్బంది వీరిని జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారామ్‌కు అప్పగించారు. జీఆర్పీ సిబ్బంది గంజాయి సీజ్ చేసి నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

ఇనార్బిట్ మాల్‌లో కూలిన సెంట్రింగ్



ఇనార్బిట్ మాల్‌లో నిర్మాణ ప్రదేశంలో కూలిన సెంట్రింగ్

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురం పోర్టు ఆస్పత్రి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇనార్బిట్ మాల్‌లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం గిరిప్రదక్షిణ రోడ్ వైపు (సత్యసాయినగర్) సెంట్రింగ్ పనులు చేస్తుండగా హఠాత్తుగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో సెంట్రింగ్ కింద ఎంత మంది కూలీలు ఉన్నారో తెలియడం లేదు. అయితే ప్రమాదం అనంతరం గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించాలని కాలనీ వాసులు చెబుతున్నారు. మరోవైపు ఈ ప్రమాదాన్ని ఇనార్బిట్‌మాల్ సిబ్బంది కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ నిర్మాణ పనుల్లో ముగ్గురు కార్మికులు మరణించినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా యాజమాన్యం మాత్రం విషయం బయటకు రానివ్వకుండా చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

విస్తృతంగా స్వచ్ఛతా పక్వాడా



విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో సెప్టెంబరు 17న ప్రారంభించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా పలు రైళ్లలో, డివిజన్ పరిధిలో గల స్టేషన్లలో స్వచ్ఛ టాయ్‌లెట్స్ క్యాంపెయిన్ నిర్వహించారు. వాల్తేర్ డివిజన్, డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై నాటికలు ప్రదర్శిస్తూ ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

3 నుంచి శ్రీలలితాపీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు



శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్

సీతంపేట: దుర్గా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీలలితా పీఠంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు శత చండీయాగం నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆయన పీఠం దర్బారు హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 4 గంటలకు లలిత అమ్మవారికి పంచామృత అభిషేకం, అర్చన, బాలభోగం సమర్పిస్తామన్నారు. అనంతరం చండీ పారాయణ, గోపూజ, శ్రీచక్రనవావరణార్చన, సాయంత్రం చండీ హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు. రోజూ మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జాబ్ మేళాలో 43 మందికి ఉద్యోగాలు



రాతపరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిటెక్నిక్, స్కిల్ హబ్ సంయుక్తంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాబ్ మేళా శనివారం ముగిసింది. పోకార్నా ఇంజినీరింగ్ స్టోన్ లిమిటెడ్, ఏసీన్ హెల్త్ కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ సంస్థలు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు 179 మంది హాజరవగా 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 102 మంది హాజరవగా 8 మంది ఎంపికైనట్లు తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎంఏవీ రామకృష్ణ మార్గదర్శకత్వంలో డీఎస్‌డీవో చాముండేశ్వరనాథ్, టీపీవో ఎం.హరిబాబు సహకారంతో ఈ ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ మేరకు విద్యార్థులకు ఎంపిక పత్రాలు అందించారు.

భారతీయ శాస్త్రవేత్తల ఆవిష్కరణలు అద్భుతం

ఎన్‌ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త వీరాచారి



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: విద్యా భారతి ఆధ్వర్యంలో స్థానిక శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన మేళా, సంస్కృతీ మహోత్సవ్ శనివారం ప్రారంభమైంది. రాష్ట్రంలో విద్యా భారతికి అనుబంధంగా ఉన్న పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొని వేదగణితం, సైన్స్, సంస్కృతికి సంబంధించిన పలు అంశాల్లో నమూనాలు ప్రదర్శించారు. అలాగే క్విజ్, ప్రయోగాత్మక పోటీలు, నాట్య ప్రదర్శనలో ప్రతిభ చాటారు. ఎన్‌ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త వై.వీరాచారి జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ శాస్త్రవేత్తలు ప్రపంచానికి అందించిన ఆవిష్కరణలు అద్భుతమైనవన్నారు. శాస్త్ర పరిశోధన రంగాల్లో విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యా భారతి రాష్ట్ర కార్యదర్శి కన్నా భాస్కర్, సహ కార్యదర్శి కె.వి.ఆనంద్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో విజ్ఞాన శాస్త్ర ప్రాధాన్యతను, విజ్ఞాన శాస్త్రానికి, సమాజానికి ఉన్న సారూప్యం తెలియజేయడానికి ఏటా విజ్ఞాన మేళాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజ్ఞాన మేళా ఆదివారం కూడా కొనసాగుతుందని శ్రీకృష్ణ విద్యా మందిర్ ప్రధానాచార్యులు వి.నర్మద తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జ్ఞానాపురం సివిల్ స్ట్రీట్‌లో తల్లిదండ్రులతో కలిసి మైలపిల్లి సుధాకర్ (22) నివసిస్తున్నాడు. నగరంలోని సెవెన్‌హిల్స్ హాస్పిటల్ వద్ద ఉన్న గుప్తా ఇన్‌లో సర్వీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ విషయం ఇటీవల ఆమెకు, అతని ఇంట్లో వాళ్లకు తెలియజేశాడు. ఇంట్లో కూడా పెళ్లి చేసేందుకు మాట్లాడుదాం అన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి 10 గంటలకు ఇంటికి చేరుకున్న సుధాకర్ భోజనం చేసి నిద్రపోయాడు. అనంతరం అర్ధరాత్రి సమయంలో హాలులో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేళాడుతుండడాన్ని కుటుంబ సభ్యులు గమనించి కిందకు దించగా అప్పటికే చనిపోయాడు. మృతుని తండ్రి నూకరాజు శనివారం ఉదయం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు ఎవరో అమ్మాయిని ప్రేమించాడని, ఆమెతో ఏదో వివాదం జరిగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గైస్ విద్యార్థికి 'ఆదిత్య బిర్లా'లో ఉద్యోగం



శ్రీవంశీకి ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, తదితరులు

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థి ప్రతిష్టాత్మకమైన ఆదిత్య బిర్లాలో ఉద్యోగం సాధించాడు. ఈ కాలేజీలో ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ విభాగంలో విద్యనభ్యసించిన శ్రీవంశీ ఇటీవల ఆదిత్య బిర్లా పెయింట్స్ డివిజన్ నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ మేరకు శ్రీవంశీని డిప్లమా ఇంజినీర్ ట్రైనీ పోస్టుకు ఎంపిక చేస్తూ సంస్థ నియామక పత్రాన్ని గైస్‌కు పంపింది. ఏడాదికి రూ.3.30 లక్షల ప్యాకేజీని విద్యార్థికి ఆఫర్ చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ విద్యార్థికి నియామకపత్రాన్ని శనివారం అందించారు. ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, అధ్యాపకులు ఎన్ఎస్‌వీ కుమారి, బి.రామాంజనేయులు, బి.స్మిత, తదితరులు విద్యార్థిని అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీక్షలో పాల్గొన్న పెన్షనర్లు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని ఆల్ ఇండియా పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (ఆప్రా) జిల్లా అధ్యక్షుడు దీనబంధు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలో ఆప్రా సభ్యులు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1340 రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమం జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ చాపకింద నీరులా ప్లాంట్‌ను అమ్మేయడానికి ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 4070 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలిగించడానికి ప్రయత్నం చేసిందంటే ప్లాంట్‌ని ప్రైవేట్ వాళ్లకి కట్టబెట్టడానికే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజా ఉద్యమాల్ని గౌరవించకపోవడం దురదృష్టకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ని కాపాడతామని చెప్పిన చంద్రబాబు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసేస్తే ఎందుకు తెరిపించలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ని రక్షించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోనాల్సి వస్తుందని హెచ్చరించారు. దీక్షలో వి.లుసీరామ్, కేఎం కుమార్ మంగళం, ఎం.త్రినాథ్, రాంప్రభు తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార : డిసెంబర్ 1న బీచ్‌రోడ్డులో 'వైజాగ్ మారథాన్' నిర్వహించనున్నట్లు ఆలివ్ గ్రీన్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు వై.శ్రీనివాస్‌కుమార్, బి.కె.రాయ్ తెలిపారు. ఈ మేరకు సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో 'వైజాగ్ మారథాన్' పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్యం, క్రీడలు, జీవితంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. వైజాగ్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. విశాఖ బీచ్‌లో నిర్వహించే మారథాన్ విజయవంతం చేయాలని కోరారు. తిరుపతిరాజు, డాక్టర్ మృదుల, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలతో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

మర్రిపాలెం : పిల్లలకు పోషకాహారం అందించడం ద్వారానే శారీరక, మానసిక ఎదుగుదల సాధ్యమవుతుందని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ విశాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి అన్నా రు. అర్బన్ ప్రాజెక్ట్ మర్రిపాలెం సెక్టార్‌కు సంబంధించి జీవీఎంసీ 53వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ లోని కార్యాలయంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల్లో శారీరక ఎదుగుదలలో లోపాలను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతల్లో పోషణ స్థాయిని మెరుగుపరచడమే కాకుండా తల్లితో పాటు బిడ్డకు పోషకాలు అందించడమే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ పనిచేస్తుందన్నారు. ముందుగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహార స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో శ్యామలదీపిక, సీడీపీవో రమణకుమారి, సహాయక సీడీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జ్వర బాధితులను గుర్తించాలి



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం పరిశీలించారు. అక్కడ అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. పథకాల అమలులో ఎలాంటి బ్యాక్‌లాగ్స్ లేకుండా చూసుకోవాలని, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్, తదితర వాటిపై సూచనలు చేశారు. అభ యాప్ శత శాతం డౌన్లోడ్ చేయించాలని, ఆధార్ నంబర్ లేకుంటే సంబంధిత ఆశ కార్యకర్తతో యాప్ అప్లోడ్ చేయించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను సకాలంలో గుర్తించాలని ఆదేశించారు. యాంటీ లార్వా ఆపరేషన్‌పై స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. లీవ్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. ఆయనతో పాటు జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు పిడికిలి బిగిద్దాం



ప్రజా సంఘాల నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వి.వి.రమణమూర్తి

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 2న జరిగే భారీ ర్యాలీని విజయవంతం చెయ్యాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా సంఘాల నాయకులతో కలిసి ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చెయ్యడానికి దూకుడు పెంచుతున్న సమయంలో ఉత్తరాంధ్ర ప్రజా సంఘాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల ప్రజా సంఘాలన్నీ కలిసి మహా ఉద్యమంలా డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద తదుపరి కార్యక్రమం కోసం తీర్మానం చేసి లక్ష మందితో ర్యాలీ చెయ్యడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇఫ్టు నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు ఎం.లక్ష్మి, వై.నూకరాజు, జె.రవి, కె.ఎస్.చలం, కె.పద్మ, సూర్యప్రకాష్, రవి, ఉప్పల లక్ష్మణరావు, పి.ఎస్.తిలక్, ఎస్ఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

శ్రద్ధ ఫౌండేషన్‌తో ఏయూటీడీ ఎంవోయూ



శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, తదితరులు

అల్లిపురం : మానసిక వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తూ, పునరావాసం కల్పిస్తున్న ఏయూటీడీతో కలిసి పనిచేస్తామని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, శ్రద్ధ ఫౌండేషన్ ఫౌండర్ భరత్ పట్వానీ స్పష్టం చేశారు. ఈ మేరకు శని వారం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు ఏయూటీడీ 203 మంది మానసిక రోగులను రెస్క్యూ చేసి, మానసిక ఆస్పత్రిలో చికిత్స అందించి ఉత్తరాది రాష్ట్రాల్లోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ పని మరింత పక్కాగా కొనసాగించేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ మేరకు ఫౌండేషన్ తరపున ఒక సైక్రియాట్రిస్ట్ టీమ్‌తోపాటు మందులు సమకూర్చినట్లు తెలిపారు. రాబోయే 6 నెలల్లో వంద మంది మానసిక రోగులకు పునరావాసం కల్పించే లక్ష్యంతో పని చేయాలని భరత్ పట్వానీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరాలీ, శ్రావణి, గౌతమ్, హరీష్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.